ప్రజాశక్తి
ఆదివారం 25 జూన్ 2023
5
విజయనగరం



పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే పద్మ అవార్డుల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్‌సిఇఒ బి.రామగోపాల్ తెలిపారు. కళలు, సాహిత్యము-విద్యా రంగం, క్రీడలు, వైద్యం, సమాజ సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, పౌర సేవలు వ్యాపారం, పరిశ్రమలు మొదలగు రంగాలలో విశేష ప్రతిభ కనబరచిన యువత/ వ్యక్తుల నుంచి పద్మ అవార్డులకు ఎంపిక నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువత ఆసక్తి గల వారు ముఖ్యకార్యనిర్వహణాధికారి, యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్, విజయనగరం కార్యాలయానికి వ్యక్తిగత వివరాలతో దరఖాస్తు చేయాలని తెలిపారు. పూర్తి వివరాలు కోసం https://awards.gov.in, https://padmaawards.gov.in వెబ్ సైట్ లను సందర్శించి, ఆన్లైన్ లో దరఖాస్తులను వచ్చేనెల 10లోగా సమర్పించాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబరు 9849913080ను సంప్రదించాలని కోరారు.

కౌలురైతులకూ పంట రుణాలు

వ్యవసాయ సలహా మండలి నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

ఈ ఖరీఫ్ సీజనులో అర్హత కలిగిన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులను జారీ చేసి, వారికి కూడా విరివిగా పంట రుణాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి నిర్ణయించింది. ఛైర్మన్ గేదెల వెంకటేశ్వర్రావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. వ్యవసాయంతోపాటు, ఉద్యానశాఖ, పశు సంవర్ధకశాఖ, బిందు తుంపర్ల సేద్యం, మత్స్యశాఖలకు చెందిన వివిధ అంశాలపై చర్చించారు. ఖరీఫ్‌కు అన్నివిధాలా సన్నద్ధం కావాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ పరిస్థితిని జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు వివరించారు. ఖరీఫ్‌కు అవసరమైన 42,308 క్వింటాళ్ల వరి విత్తనాలను, సుమారు 24వేల మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 28 లోగా ఇకెవైసి పూర్తిచేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, జిల్లాలో అర్హత ఉన్న కౌలు రైతులందరికీ రుణాలు ఇప్పించేందుకు వీలుగా, వారికి గుర్తింపు కార్డులను జారీ చేయాలని కోరారు. ఖరీఫ్‌లో విత్తనాలకు రైతులు ఇబ్బంది పడకుండా, ముందే అవసరమైన స్టాకు తెప్పించి, ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉంచాలని అన్నారు. ఈ క్రాప్ నమోదులో తప్పులు దొర్లకుండా చూడాలని అన్నారు. విత్తనాలు, ఎరువుల సరఫరాను పర్యవేక్షించేందుకు టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, జిల్లాలో ఖరీఫ్‌కు అవసరమైన అన్ని రకాల చర్యలనూ చేపట్టినట్టు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పశువులు అనారోగ్యానికి గురైనట్లు తెలుస్తోందని, లక్షణాలను గుర్తించి, వాటి నివారణకు తగిన చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సభ్యులు వీధికుక్కల వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించగా, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వివిధ ప్రమాదాల కారణంగా వలలు నష్టపోయిన మత్స్యకారులకు, సబ్సిడీపై వాటిని అందించాలని మత్స్యశాఖకు ఆదేశించారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ, రైతుల సమస్యలను ప్రస్తావించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంపద రకం వరి విత్తనాలకు మంచి గిరాకీ ఉందని, వీటిని ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో, రైతులు ప్రయివేటు వర్తకుల దగ్గర కొనుగోలు చేస్తున్నారని చెప్పారు.

బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న వైఎస్ఆర్ పశు నష్టపరిహారం గురించి ప్రశ్నించారు. బిందు సేద్యం యూనిట్లు త్వరగా గ్రౌండింగ్ జరిగేలా చూడాలని కోరారు. 2022 డిసెంబరు వరకు పెండింగ్‌లో ఉన్న పశు నష్టపరిహారం ఇటీవలే మంజూరైందని, ఈ నెలాఖరుకు రైతుల ఖాతాల్లో జమ అవుతుందని పశు సంవర్ధకశాఖ జెడి తెలిపారు. సమావేశంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, డిసిసిబి ఛైర్మన్ వేచలపు చినవెంకట రామినాయుడు, డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ విశ్వేశ్వర్రావు, ఎపిఎంఐపి పీడీ పిఎన్‌వి లక్ష్మీనారాయణ, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి, ఇతర శాఖల అధికారులు, కమిటీ సభ్యులు జగన్నాధం, కృష్ణమ్మ, మధుసూధనరావు, వాసుదేవరావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిపై ప్రత్యేక నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

నేర చరిత్ర గల వ్యక్తుల నేర ప్రవృత్తి, జీవనశైలిపై ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీసు అధికారులకు ఎస్‌పి ఎం.దీపిక సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మాసాంతర నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వివిధ పోలీసు స్టేషన్లలో రౌడీ షీట్లు కలిగిన వ్యక్తుల నేర ప్రవృత్తి, ప్రవర్తనపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. రౌడీ షీట్లు కలిగిన వ్యక్తులు ఇంత వరకు ఏయే నేరాలకు పాల్పడ్డారు. వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులు ఏ స్థాయిలో ఉన్నాయి, ప్రస్తుతం సదరు వ్యక్తుల నేర ప్రవృత్తి, ప్రవర్తన, జీవనశైలి గురించి సంబంధిత అధికారులను ఎస్‌పి అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీట్లు తెరవబడి, సత్ప్రవర్తన కలిగి, నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సామాన్య జీవనం సాగిస్తూ, భవిష్యత్తులో ఎటువంటి నేరాలకు పాల్పడరన్న వ్యక్తుల షీట్లను డిఎస్‌పి స్థాయి అధికారులు ఒకసారి సమీక్షించి, వాటిని మూసివేయాలన్నారు. వీరి గురించి క్షేత్రస్థాయి విచారణలో మహిళా సంరక్షణ పోలీసుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాల నియంత్రణ, రవాణను అరికట్టి, విద్యార్థులు, యువతకు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను వివరించేందుకు అవగా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గంజాయిని విక్రయించే చిన్న వ్యాపారులు, గంజాయి సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. 'జగనన్నకు చెబుదాం'కు వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతను ఇచ్చి, నిర్ధిష్ట సమయంలోగా చర్యలు చేపట్టి, వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం, జిల్లా ఎస్‌పి గ్రేవ్ కేసులను, ఫోక్సో కేసులు, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి, దర్యాప్తు పూర్తి చేయాలని, కోర్టుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలు

బుదరాయవలస స్టేషన్‌లో నమోదైన సైబరు నేరంలో నిందితుడిని అరెస్టు చేసి, పోయిన నగదులో రూ.8.64 లక్షలు రికవరీ చేయడంలో ప్రతిభ కనబర్చిన ఎస్‌ఐ సిహెచ్. నవీన్ పడాల్‌ను ఎస్‌పి అభినందించి జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చి, గత నెలల్లోల నమోదైన కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయడంలో ను, పోయిన ఆస్తులను రికవరీ చేసినందుకు, గంజాయి అక్రమ రవాణను నియంత్రించి, ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు చీపురుపల్లి సిఐ జి.సంజీవరావు, బొండపల్లి ఎస్ఐ ఎస్.రవి, సిసిఎస్ ఎస్ఐ ఎస్. సుదర్శన్, డిసిఆర్‌బి ఎస్ఐ ఆర్. వాసుదేవ్, ఎఎస్ఐ ఎ.గౌరీ శంకర్, హెచ్‌సి జి.జనార్ధనరావు, కానిస్టేబుళ్ళు జి. లావణ్య, టి. అప్పల నాయుడు, జి. దాసు, కె.రమేష్, ఎం. మురళి, ఎన్.రవి కుమార్, జి.గౌరీ శంకర్, హోంగార్డు ఎం. సురేష్‌ను ఎస్‌పి అభినందించారు. సమావేశంలో డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, పి.శ్రీధర్, డి.విశ్వనాథ్, ఆర్.శ్రీనివాసరావు, వీరకుమార్, ఎల్.శేషాద్రి, న్యాయ సలహాదారులు వై.పరశురాం, డివిజ ఎఏ వెంకట రమణ, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కుమిలి హెల్త్ క్లినిక్ తనిఖీ

ప్రజాశక్తి-పూసపాటిరేగ



కాలువను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

మండలంలోని కుమిలి గ్రామ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు శనివారం తనిఖీ చేశారు. మందులు అందుబాటులో ఉంటున్నాయా లేదా అని ఆరా తీశారు. ల్యాబ్ పరీక్షలను తనిఖీ చేశారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల పరిశీలన, కంటి వెలుగు కార్యక్రమం, డ్రైడే, ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొని పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు తెలియజేశారు. ప్రజలకు వైద్యసేవలను అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. యుపిహెచ్‌సి సాయినగర్ కాలనీని సందర్శించి ఎన్‌సిడి సర్వే, ఇతర ఆరోగ్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి మణి, సహాయ మలేరియా అధికారి డివి రమణ, ఎపిడిమాలజిస్టు డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కడపలో గల వైఎస్ఆర్ స్పోర్ట్ స్కూల్‌లో 4,5వ తరగతుల్లో ప్రవేశానికి విజయనగరం క్రీడా ప్రాధికర సంస్థ ఆధ్వర్యాన జిల్లా స్థాయి ఎంపికలు శనివారం రాజీవ్ స్టేడియంలో జరిగాయి. ముఖ్య శిక్షకులు ఎల్ వి రమణ మాట్లాడుతూ ఎంపిక ప్రక్రియలోఎత్తు, బరువు, స్టాండింగ్ జంప్, 8వందల మీటర్ల పరుగు,ఎత్తు, బరువు ఎంపికలు నిర్వహిం చారు. అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 29, 30 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎంపికల్లో పాల్గొంటారని తెలిపారు.

విద్యుత్తు బిల్లులు నేడు చెల్లించవచ్చు

విజయనగరం టౌన్ : జిల్లాలోని గల అన్ని విద్యుత్ రెవిన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లులు వసూళ్ల కౌంటర్లు ఆదివారం కూడా పని చేస్తాయని, విద్యుత్ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష

కమిషనర్ శ్రీరాములు నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం నగరంలో పకడ్బందీగా జరగాలని నోడల్ అధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములు నాయుడు ఆదేశించారు. శనివారం తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన నోడల్ అధికారుల సమావేశం లో పథకం వివరాలను, నిర్వహించాల్సిన విధానాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నిర్దేశించిన 11 రకాల ధ్రువీకరణాలను లబ్ధిదారులకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత నోడల్ అధికారులపైనే ఉందన్నారు. 24 నుంచి ఈ నెలాఖరు వరకు ఇంటింటికి వాలంటీర్లు వెళ్లి పథకం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. సచివాలయాల వారీగా జరుగుతున్న జగనన్న సురక్ష పథకం సక్రమ అమలుపై నోడల్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు బృందాలు

నగరంలో ప్రత్యేక పారిశుధ్య బృందాలతో మెరుగైన పారిశుధ్య విధానాన్ని చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీ రాములునాయుడు వెల్లడించారు. పలు వీధులలో జెసిబిలు వెళ్లడానికి వీలులేని చిన్నచిన్న సందులలో, ఇళ్ల పక్కన ఉన్న చిన్న కాలువలలో చెత్తాచెదారాలను తొలగించేందుకు ప్రత్యేక పారిశుధ్య బృంద కార్మికులతో ప్రక్షాళన చేపడుతున్నా మన్నారు. వీరంతా మురికివాడల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించే కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారన్నారు. సర్కిళ్ళ వారీగా కమిటీల వివరాలు, ఏర్పాటుపై సంబంధిత పారిశుధ్య పర్యవేక్షకులకు ఆదేశాలు జారీ చేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కెజిబివి గెస్ట్ టీచర్లు

మూడో రోజుకు గెస్ట్ టీచర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తొలగించిన కెజిబివి గెస్ట్ టీచర్‌లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, నోటిఫికేషన్ రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తూ గెస్ట్ టీచర్లు చేపట్టిన ఆందోళన మూడోరోజు శనివారం కూడా కలెక్టరేట్ వద్ద కొనసాగింది. సిఐటియు నాయకత్వంలో గెస్ట్ టీచర్లంతా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ గెస్ట్ టీచర్లుగా కొనసాగుతున్న పిజిటి, సీట్ టీచర్లను అర్ధాంతరంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. న్యాయం చెయ్యాల్సిన ప్రభుత్వం తమను రోడ్డున పడేలా చీకటి జీవో తీసుకువచ్చిందని అన్నారు. జిల్లాల్లో జరుగుతున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉద్యోగాలకు దూరం చేసేలా ఉందని, తమ స్థానంలో వేరే వారిని పెట్టేలా ఉంది కాబట్టి వెరిఫికేషన్ ప్రక్రియలో ముందు నుంచి పనిచేస్తున్న టీచర్లకు పోస్టింగ్ ఇచ్చి, పర్మినెంట్ చేసి న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశఉ. కెజిబివి టీచర్లు చేస్తున్న న్యాయ పోరాటానికి సిఐటి యు అండగా ఉంటుందన్నారు. ధర్నా లో గెస్ట్ టీచర్లు ఎ.రమాకుమారి, ఎల్.సూరీడమ్మ, తనుజ, రాధ, భారతి పాల్గొన్నారు.

సెప్టెంబర్ నెలాఖరికి భవన నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం

నాడు-నేడు కింద చేపడుతున్న భవన నిర్మాణాలన్నీ వచ్చే సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. శనివారం వెబెక్స్ ద్వారా ఎంపిడిఒలు, ఎంఇఒలు, డిఇలు, ఎఇలతో నాడు-నేడు పనుల పురోగతి పై కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించారు. గత సమీక్ష 15 రోజుల క్రితం జరిగిందని, ఈ 15 రోజుల్లో కొన్ని మండలాల్లో 50 శాతం కంటే తక్కువ పురోగతి కనపడుతోందని వారికి షోకాజ్ నోటీస్ జారీ చేస్తున్నామని అన్నారు. గత సమావేశంలో 77 స్టేజ్ మార్పులను లక్ష్యంగా నిర్ణయించగా 54 మాత్రమే స్టేజ్ మార్పులు జరిగాయని, తక్కువ చేసిన వారికి కారణాలతో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన భవనాలను జూన్ 30 నాటికి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. మిగిలిన భవనాలు జులై 15 నాటికి తప్పకుండా స్టేజ్ మార్పు జరగాలన్నారు. నిధుల సమస్య లేదని, పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. లక్ష్యాలను సాధించని వారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అశోక్ బర్త్‌డే సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు తెలిపారు. శనివారం బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 25న ఉదయం 9గంటల నుంచి మెగా రక్తదానశిబిరం నిర్వహిస్తామన్నాఉ. గత ఏడాది 484మంది రక్తదానం చేసి రికార్డు సృష్టించారన్నారు. ఈసారి కూడా విద్యార్థులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. 26న ఉదయం ఆయన పుట్టిన రోజు సందర్భంగా ముందుగా మూగ చెవిటి పాఠశాలలో కేక్ కట్ చేసిన అనంతరం పార్టీ కార్యాలయంలో నాయకులను, కార్యకర్తలను అశోక్ కలుస్తారని తెలిపారు. రక్తదానం ఎంతో మంది ప్రాణాలు కాపాడడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి సహకరించాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు రాజేష్ బాబు, పట్టణ కార్యదర్శి బంగారు బాబు, గంటా పోలి నాయుడు, వేచలపు శ్రీనివాసరావు, మహేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రలో టిడిపి జిల్లా నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం కోట

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తూ ఇచ్చిన హామీలను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు నిర్వహిస్తున్న బస్సుయాత్ర కార్యక్రమం అనకాపల్లి పార్లమెంట్ స్థానంలో మూడో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఉమ్మడి జిల్లా నాయకులు గుమ్మిడి సంధ్యారాణి , మాజీ స్పీకర్ కావలి ప్రతిభ భారతి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు, కోళ్ల లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్లాపస్ సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

పెర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యూటీలిటీ సర్వీసెస్(ప్లా పస్) సేవలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. ప్రజలు ప్రతి రోజు వినియోగించు కొనే సేవలైన రవాణా, పోస్టల్, టెలిగ్రాఫ్, ఎలక్ట్రిసిటీ మొదలైన ప్రజా వినియోగ సేవలకు సంబందించిన వివాదాల పరిస్కార వేదికయే శాశ్వత లోక్ అదాలత్ అని అన్నారు. శనివారం న్యాయ సేవాసదన్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజా సేవలలో ఏమైనా లోపాలుంటే ప్లాపస్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. ప్లాపస్ ఛైర్మన్ జి. దుర్గయ్య మాట్లాడుచు ప్రజా సేవలైన వైద్యం, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్సు, ఆసుపత్రులు మొదలైన సేవలలో లోపముంటే కోటి రూపాయల వరకు నష్టపరిహారం పొందగలిగిన కేసులను ఇక్కడ ఉచితంగా రుసుము లేకుండా ఫైల్ చేసుకొని పరిహారం పొందవచ్చునని అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కె. నాగమణి, మాట్లాడుతూ ఫీజు లేకుండా కేసులు ఫైల్ చేసుకొనే సదుపాయం కేవలం లోక్ అదాలత్‌లో మాత్రమే ఉందని, ప్రజలంతా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

మానవీయ విలువలు పెంపొందించాలి

'గురజాడ' సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో మాజీ మంత్రి అశోక్



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు, సివి రాజు, కృష్ణాజి, వెంకటరావు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విద్యార్థుల్లో మానవీయ విలువలు పెంపొందించాలని కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్ గజపతిరాజు అన్నారు. ఆ దిశగా గురజాడ స్కూల్ పనిచేయడం అభినందనీయమని కొనియాడారు. గురజాడ పాఠశాల రజతోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఏటికొప్పాక కొయ్యబొమ్మల కళాకారుడు సివి రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ పాఠ్యాంశాలతోపాటు దేశమును ప్రేమించు మన్నా... మంచి అన్నది పెంచుమన్నా... సొంతలాభం కొంతమానుకు పొరుగువారికి పాటుపడవోయ్ అన్న గురజాడ దార్శికతను విద్యార్థుల్లో సృజింపజేయాలని కోరారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపుల నివారణ చట్టాల అమలు వల్ల మాత్రమే సాధ్యం కావని, విద్యార్థుల్లో మానవీయ విలువలు పెంపొందించడం ద్వారా క్రమంలో సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. పద్మశ్రీ అవార్డులను కూడా నేటి పాలకులు అవమాన పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్మాన గ్రహీత సివి రాజు మాట్లాడుతూ 550ఏళ్ల క్రితం నాటి కొయ్యబొమ్మల తయారీపై తనకున్న ఆసక్తి వెనుక విజయనగరం మట్టివాసన ఉందన్నారు. విజయనగరంలోనే పుట్టడం వల్ల కళలపై ఆసక్తి పెరిగిందని అన్నారు. వారసత్వం సంపద, కళలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందనా అన్నారు. మరో ముఖ్యఅతిధి ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు మాట్లాడుతూ గురజాడ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులంతా, గురజాడ రచనలు పూర్తిగా చదవాలన్నారు. ఆ మహాకవి చూపించిన దేశభక్తిని అలవరచుకోవాలన్నారు. తెలుగు సాహిత్యంలో నిష్ణాతులుగా మారకపోయినా పర్వాలేదుగాని, ఏదేశమేగినా తెలుగును మరిచిపోవద్దని పిలుపు నిచ్చారు. పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ ఎంవిఎన్ వెంటకరావు మాట్లాడుతూ మహాకవి గురజాడ పేరిట ఏర్పాటు చేసిన ఈ స్కూళ్లో చదువుకున్న విద్యార్థులో ఎంతో మంది ఉన్నత శిఖరాలకు వెళ్లారని, వారంతా రజతోత్సవాల్లో భాగస్వామ్యం కావడం గర్వకారణమని అన్నారు. కృష్ణాజీ మాట్లాడుతూ పాఠశాలలో కేవలం చదువు మాత్రమే కాకుండా సామాజిక అంశాలపై అవగాహన కల్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దుతన్నారని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప మాట్లాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. హెచ్‌ఎం శేఖర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేదలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, పలు సంస్థలు వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించడం ప్రశంస నీయమని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శనివారం స్థానిక వీటీ అగ్రహారం వద్ద జయభేరి సంస్థ కార్యాలయంలో విజయ బ్లడ్ బ్యాంక్, విజయ దుర్గ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య, రక్తదాన శిబిరాలను ఆమె ప్రారంభించారు. వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందించడంతో పాటు.. చికిత్స అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో చేయించడానికి ఈ ఆసుపత్రులు ముందుకు వచ్చాయని తెలిపారు.

ప్రజా సమస్యలు పక్కదారి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జిల్లాలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలను ఏకంగా పక్కదారి పట్టిస్తున్నాయా? నాయకులు కూడా రాజకీయ పబ్బం కోసం తెరవెనుక ప్రయత్నాలు చేసుకుంటున్నారా? అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. యావత్తు జనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న భారాలు, విధానపరమైన సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా వామపక్షాలు మినహా మిగిలిన రాజకీయ పార్టీలన్నీ రానున్న ఎన్నికలే లక్ష్యంగా తెరవెనుక ప్రయత్నాలు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో విద్యుత్ ఛార్జీల పెంపు ప్రజలపాలిట పెనుభారంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై వామపక్షాలు, ముఖ్యంగా సిపిఎం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యాన జనం రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేస్తున్నారు. ప్రజాగ్రహం రోజురోజుకూ పెరుగుతోంది. అడపాదడపా నిరసన కార్యక్రమాలు చేపట్టి, చేతులు ముడుచుకోవడం తప్ప ప్రజలకు అండగా నిలబడి ప్రభుత్వాన్ని నిలదీయడంలో టిడిపి ప్రతిపక్ష పాత్రపోషించ లేకపోతోంది. గతంలో టిడిపి కూడా విద్యుత్ ఛార్జీల పెంపుతో ప్రజల్ని ఇబ్బందులకు గురి చేసిందని, అప్పట్లో నిలదీసిన ప్రజలపై కర్కశంగా వ్యవహరించిందని, అందువల్లే ప్రజల విశ్వాసాన్ని కూడా పొందలేకపోతోందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఇటు అధికార పక్షం మాత్రం విద్యుత్ ఛార్జీల భారాన్ని కప్పిపుచ్చుకునే విధంగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలతో కాలక్షేపం చేస్తోంది. మరోవైపు పోలవరం నిర్వాసితుల సమస్య రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో జిల్లాలోని తోటపల్లి, తారకరామతీర్థసాగర్, పెద్దగెడ్డ, విశాఖ రాయ్‌పూర్ రహదారి, భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసితుల సమస్య కూడా రచ్చకెక్కుతోంది. ముఖ్యంగా తోటపల్లి, తారకరామతీర్థసాగర్ నిర్వాసితులకు నేటికీ న్యాయం జరగలేదు. పరిహారం, పునరావాసం కల్పించడంలో కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాలన్నీ విఫలమయ్యాయి. దీంతో, ఓవైపు భూములు కోల్పోయి, మరోవైపు పునరావాసానికి నోచుకోక బాధితులు అవస్థలు పడుతున్నారు. ఈనేపథ్యంలో సిపిఎం వారికి అండగా నిలుస్తోంది. అటు పెద్దగెడ్డ నిర్వాసితులదీ అదే పరిస్థితి. మరోవైపు గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలు, బల్కుమిల్క్ సెంటర్, వెల్‌నెస్ సెంటర్ తదితర ప్రభుత్వ భవనాలకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు అప్పుల పాలయ్యారు. ఇటువంటి అప్పులతోనే పది రోజుల క్రితం బొబ్బిలి మండలం అలజంగి ఉప సర్పంచి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారనే చర్చ నడిచింది. సాక్షాత్తు వైసిపికి చెందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు కూడా ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. వీటిపై ఇప్పటికీ ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బిల్లులు చెల్లింపునకు మీనమేషాలు లెక్కించడం వల్ల భవన నిర్మాణాలు కూడా అసంపూర్తి గోడలతో వెక్కిరిస్తున్నాయి. ప్రభుత్వ కార్యకలాపాలు పరాయి పంచల్లో సాగుతున్నాయి. మరోవైపు ఇటీవల కాలంలో ఇళ్ల స్థలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. ఇటువంటి సమస్యలపై ప్రతి సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి కుప్పలు తెప్పలుగా వినతులు, ఫిర్యాదులు వస్తున్న సంగతి తెలిసిందే. ఎస్.కోట నియోజకవర్గంలో ఆక్రమణలు జరిగాయంటూ సాక్షాత్తు వైసిపికి చెందిన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కూడా వ్యాఖ్యానించడం గమనార్హం. పుస్తకాల్లో ఇష్టారాజ్యాంగా పాఠ్యాంశాలు మార్చడం, ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాల వ్యాపారం, ఫీజుల పెంపు తదితర సమస్యలపైనా జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమను కొనసాగించాలంటూ కెజిబివిల్లో గెస్ట్ లెక్చరర్లు రోడ్డెకారు. వీటిపై టిడిపి ప్రతిపక్ష పాత్రపోషించక పోగా, అధికార పక్షం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రూఅప్ ఛార్జీలపై పోరాటం



నగదు అందిస్తున్న గొంప కృష్ణ, గొంప వెంకటరావు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వేపాడ: మండలంలోని గుడివాడకు చెందిన గేదెల పాపని జగ్గయ్యపేట గ్రామంలో రోడ్డు వద్ద టీ దుకాణం ఏర్పాటు చేసుకొని తన కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఇటీవల ఆ దుకాణం ప్రమాదవశాత్తు కాలిపోయింది. దీనికి స్పందించిన టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ గొంప కృష్ణ ఆమెకు శనివారం రూ. 10వేలు ఆర్థిక సాయం అందించారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు రూ. 5వేలు అందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ టిడిపి ఆపదలో ఉన్న వారిని ఎప్పుడూ ఆదుకుంటుందన్నారు. అనంతరం గ్రామస్తులతో ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గం మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, కొత్తవలస అధ్యక్షుడు గొరపల్లి రాము, జామి టిడిపి అధ్యక్షుడు ఎల్. రవికుమార్, మాజీ జెడ్‌పిటిసి పెదబాబు, ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, సర్పంచ్ రెడ్డి పైడిబాబు, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, గొర్లె నాగరాజు, నాగళ్ల సింహాచలం, పల్లె ధనుంజయ, కొట్యాన అర్జున, సేనాపతి అప్పారావు, వై సూర్యం, టి. కృష్ణ, ఎన్. వెంకటరావు, ఎం అప్పలనూరి, కె.పి నాయుడు, బోజంకి నారాయణమూర్తి నల్లబెల్లి, సింగరాయ ఎస్ కామేష్, ఎస్ వెంకటరమణ, సిరికి రమణ, సాయికృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత

బొబ్బిలి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మెప్మా ఆధ్వర్యంలో శనివారం మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. స్వయం ఉపాధి కల్పించేందుకు ద్వారా మహిళలకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ ఛైర్మన్లు చెలికాని మురళి, జి.రమాదేవి, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబీకులకు పరామర్శ

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గజపతినగరం మాజీ ఎమ్మెల్యే తాడ్డి సన్యాసినాయుడు కుటుంబీకులును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం పరామర్శించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ పట్టణ, రూరల్ ప్రాజెక్టు సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. బాల్య వివాహాలు నివారణపై పట్టణంలోని కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. మహిళలు, అమ్మాయిలు వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్ల పరిశీలన

గంట్యాడ: మండలంలోని పలు గ్రామాల్లో వైకెపి ఆధ్వర్యంలో అందించిన యూనిట్లను కెవిఐబి అసిస్టెంట్ డైరెక్టర్ మురళీకృష్ణ ఎస్‌విఈపి ఎపిఎం అనురాధ, కెవిఐవి ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్‌లు శనివారం పరిశీలించారు. పెనసాం, నరవ గ్రామాల్లో వీరు యూనిట్లున పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనిట్లు ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని వీటి గురించి ఇతరులకు అవగాహన కల్పించాలని అన్నారు. పెనసాం గ్రామంలోని జెరాక్స్ మిషన్ యూనిట్, సప్లై లైటింగ్ యూనిట్లను నరవలో లైటింగ్ యూనిట్లను పరిశీలించారు. లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మండల స్థాయిలో జరిగిన మండల సమైక్య విఒఎల సమావేశానికి హాజరై ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం లబ్ధిదారులు ఎంపిక విధానం గురించి అర్హతల గురించి అవగాహన కల్పించారు. సమాఖ్య సంఘాలు అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాస్, ఎఫ్ పిఒ ఎపిఎం శైలేష్, సీసీలు చిన్న బాబు, అచ్చం నాయుడు, ముచ్చుల్ నాయుడు, గౌరీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో గడపగడపకు..

శృంగవరపుకోట: పట్టణంలోని సచివాలయం 3 పరిధిలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు 214వ రోజు గడపగడపకు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మూడేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్స్ వాకాడ రాంబాబు, షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి నిధులతో బోరుబావులు మంజూరు


లక్కవరపుకోట: దాహార్తిని తీర్చేందుకు ఎంపిపి నిధులతో మంజూరైన బోరుబావులను స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. మండలంలోని కల్లేపల్లి, రేగ, కోనమశివానిపాలెం, లచ్చింపేట, నరసన్నపేట గ్రామ పంచాయతీలలో మొదటి దశలో బోర్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గోకాడ ముసలినాయుడు, నీలకంఠం, ఎంపిటిసి బొడ్డు గణపతి, తూర్పాటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నరసన్నపేట పంచాయతీలో జగనన్న శాశ్వత భూహక్కు (ఈ సర్వే కార్యక్రమం) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆదిబాబు, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, ఎంపిటిసి భూమిరెడ్డి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వాకర్స్ క్లబ్బులు ఏర్పాటు చేయండి

శృంగవరపుకోట: కొత్త వాకర్స్ క్లబ్బులను ఏర్పాటు చేయాలని పుణ్యగిరి వాకర్స్ క్లబ్ సభ్యులను వాకర్స్ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కర్రోతు సత్యం సూచించారు. ఇక నడవండి నడిపించండి అనే సిద్ధాంతాన్ని పుణ్యగిరి వాకర్స్ క్లబ్ సభ్యులు పాటించాలని పిలుపునిచ్చారు. ఆయన శనివారం పుణ్యగిరి వాకర్స్‌క్లబ్‌లో సభ్యులతో సమావేశమయ్యారు. ప్రజల్లో నడక వంటి శారీరక శ్రమ వల్ల చేకూరే ఆరోగ్య పద్ధతులపై అవగాహన కల్పించాలని కోరారు. రీజియన్ కౌన్సిలర్-3 కె.ఎర్నాయుడు మాట్లాడుతూ విశాఖలో డిసెంబర్ 23,24 తేదీల్లో వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ కార్యక్రమానికి పుణ్యగిరి వాకర్స్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్టులో సుమారు రూ.6కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, మీ క్లబ్ ద్వారా చేసే సేవా కార్యక్రమాలకు సంబంధించి బిల్లులు అందజేస్తే మీరు ఖర్చు చేసిన నగదును తిరిగి ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ మ్యాగజైన్‌ను డిస్ట్రిక్ట్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఆవిష్కరించి పుణ్యగిరి వాకర్స్‌కి అందించారు.

ఘనంగా బేబినాయన జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి



శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కోటలో అభిమానులు, కార్యకర్తలు కోలాహలం మధ్య వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రులు శత్రుచర్ల విజయ రామరాజు, సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యేలు తెంటు రాజా, బి.చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ డి.జగదీష్, కురుపాం నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వరి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బేబినాయనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. బేబినాయనకు శుభాకాంక్షలు చెప్పేందుకు జనం క్యూ కట్టారు. బేబినాయన ఆరోగ్యంగా ఉండాలని శ్రీవేణుగోపాలస్వామి, గొల్లపల్లి శ్రీదాడితల్లి ఆలయాలు వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

ఉర్రూతలూగించిన పల్సర్ బైక్ రమణ పాటలు

బేబినాయన పుట్టినరోజు సందర్భంగా కోటలో ఏర్పాటు చేసిన పల్సర్ బైక్ రమణ పాటల కచేరి అభిమానులు, కార్యకర్తలను ఉర్రూతలూగించింది. రమణ బృందం పాడిన జానపద గేయాలు ఆకట్టుకున్నాయి.

శుభాకాంక్షలు చెప్పిన చంద్రబాబు

బేబినాయనకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చరవాణిలోను, ట్విట్టర్‌లో జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

ప్రజాశక్తి - గజపతినగరం

ట్రూ అప్ ఛార్జీలు తగ్గింపుకై ప్రతి ఒక్కరూ పోరాడాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాస్ కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్దుబాటు ఛార్జీలు పేరుతో కరెంటు ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపి అన్యాయం చేస్తున్న తీరును వివరించడానికి మండలంలోని బంగారంపేట గ్రామంలో ఆయన శనివారం పర్యటించి విద్యుత్ బిల్లులను పరిశీలించారు. ఒక్కొక్కరికి రూ.10వేల వరకు భారాలు పడి ఉన్నాయని చెప్పారు. సుమారుగా రూ.30 వేల కోట్లు వరకు రాష్ట్ర ప్రజలు భారాలకు బలవుతున్నారన్నారు. ప్రజలపై భారాలు మోపి కార్పొరేట్లకు ఈ రెండు ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. రైతులు, దళిత, గిరిజనులు, పేదలకు సబ్సిడీలకు దూరం చేస్తున్నారని చెప్పారు. అన్ని ప్రభుత్వ రంగాలను ప్రైవేటుపరం చేస్తూ దేశానికి రాష్ట్రానికి నష్టం చేస్తున్నారన్నారు. క్రమేనా విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేసి ఆదానీ అంబానీలకు అప్పజెప్పి విద్యుత్ రంగాన్నే వారి గుప్పెట్లో పెట్టి ప్రజలని హింసించే దానికి పథకం రూపొందించి విధానాలను అమలు చేస్తున్నారని వివరించారు. అందుకనే ప్రభుత్వాలు సర్దుబాటు ఛార్జీల భారాల వేసి సబ్సిడీలను ఎగరగొడుతున్నారని విమర్శించారు. ప్రజలు జీవించడానికి మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే సమకూర్చాలని ప్రతికే హక్కును హరించే హక్కు ప్రభుత్వాలకు లేదని రాజ్యాంగానికి తూట్లు పొడిస్తే ఊరుకోకూడదని ప్రజలు ఐకమత్యంగా పోరాడి విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలని భారాలను తిప్పి కొట్టాలని ఆయన



గజపతినగరం: అధికంగా వచ్చిన కరెంటు బిల్లులను చూపిస్తున్న వినియోగదారులు

కోరారు. భవిష్యత్తులో స్మార్ట్ మీటర్లు పెట్టి కరెంటు యూనిట్‌కి రూ.20 వరకు వసూలు చేసే ఆలోచనే దిక్కు ఉండదని వివరించారు. అందుకనే వామపక్షాలు ఈ నెల 30వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చేస్తున్న ధర్నాలో ప్రజలంతా పాల్గొని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.రాము, రాములమ్మ, అచ్చియమ్మ, రిబికా, శుభ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : రాష్ట్రప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలను తగ్గించే వరకు ప్రజలంతా పోరాడాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు అన్నారు. విద్యుత్తు ఛార్జీలపై శనివారం 25, 29, 45,46 డివిజన్లలో సిపిఎం ఆధ్వర్యాన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా 29వ వార్డులో దళితుడైన బలగ మోహన్ ఇంటికి రూ.1133 బిల్లు వచ్చినట్లు బాధితుడు తెలిపాడు. వాస్తవానికి ఎస్‌సి కుటుంబాలకు 200 యూనిట్లు వరకు విద్యుత్తును ఉచితంగా ఇవ్వాలి. కానీ ఆయన నివాసముంటున్న గుడెసెకు రూ.11330 బిల్లు రావడంతో ఆయన అవాక్కయ్యాడు. ఈ విషయాన్ని సిపిఎం నాయకుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై విద్యుత్ ఛార్జీలను అమాంతంగా పెంచి ప్రజలపై రూ.1400 కోట్ల భారాలు మోపుతున్నాయని అన్నారు. గతంలో సంవత్సరానికో రెండేళ్లకో విద్యుత్ ఛార్జీలు పెంచేవారని, ఇప్పుడు మరీ దారుణంగా ప్రతి నెలా విద్యుత్‌ఛార్జీలు పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటివరకు కరెంట్ బిల్లు చెల్లించిన సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.6వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని అన్నారు. నిత్యవసర సరుకులు ధరలతో పాటు కరెంటు ఛార్జీలను కూడా అమాంతంగా పెంచి ప్రజలపై భారాలు వేస్తున్నారని తెలిపారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు ఈనెల 30న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు బి. రమణ, సిఐటియు నాయుకులు త్రినాథరావు పాల్గొన్నారు.

ఎంఇఒను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- బొబ్బిలి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న మండల విద్యాశాఖ అధికారిను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మణికుమార్, నాయకులు వాసు, శివ డిమాండ్ చేశారు. ప్రైవేట్ గోదాంలో పుస్తకాలు అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో సురెస్ స్కూల్‌లో పుస్తకాల పేరుతో వేలకు వేలు ఫీజులు వసూలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పుస్తకాల గదిని సీజ్ చేయాలని అక్కడ ధర్నా నిర్వహించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల పరిధిలో ఎటువంటి అమ్మకాలు చేయకూడదని ఉన్నా సరే ఇటువంటి పాఠశాలలు అన్యాయంగా వేలకు వేలు వసూలు చేయడం దుర్మార్గం అన్నారు. వీటిని పట్టించుకోవాల్సిన ప్రభుత్వం కళ్ళు మూసుకుపోయి వ్యవహరిస్తుందని అన్నారు. పాఠశాలలో మూడవ తరగతి పిల్లవాడికి 6 వేల రూపాయలకు పైగా వసూలు చేయడం చూస్తే ఇది విజ్ఞానాన్ని పంచే పాఠశాల లేక విద్యార్థుల రక్తాన్ని ధనం రూపంలో పీల్చే పాఠశాలో అర్థం కావడంలేదన్నారు. పుస్తకాలు అమ్మకుండా చూస్తామని ఎంఇఒ హామీ ఇవ్వకపోవడంతో పాటు అస్సలు పట్టించుకోని



శృంగవరపుకోట: మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష

పరిస్థితి ఉందని ఇలా కార్పొరేట్ విద్యా సంస్థలకు దన్ను కాస్తున్న ఎంఇఒ పై అదికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షాన తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిహెచ్.వాసు, ఎస్.కేశవ, కె.డేవిడ్, కె. శ్రీను, బి.తేజ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం హర్ష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో గల దేవి కూడలి వద్ద విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల నుంచి చదువుకునేందుకు పాఠ్యపుస్తకాలు అందించడంలో, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. పాఠ్యపుస్తకాలు లేకుంటే విద్యార్థులు ఎలా చదువుకొని ఉత్తీర్ణులై ఉన్నత చదువుల కొరకు బయటకు ఎలా వెళతారని ఆయన ప్రశ్నించారు. మరోపక్క విద్యార్థులకు ఉచితంగా పెడుతున్న మధాహ్న భోజన పథకాన్ని రద్దు చేసేసారన్నారు. దీని వల్ల విద్యార్థులు కొన్నిసార్లు పస్తులు ఉండాల్సి వసుందన్నారు. ప్రభుత్వ హై స్కూల్లో పెడుతున్న మధ్యాహ్న భోజనం జూనియర్ కళాశాలలో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. అధికారులు, పాలకులు దృష్టిసారించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల సమస్య పరిష్కారం చేస్తారని, ఉచిత మధ్యాహ్న భోజన పథకం పునరుద్ధరించి న్యాయం చేయాలని లేని పక్షాన విద్యార్థులందరినీ ఐక్యం చేసి ఆందోళనకు సిద్ధం అవుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రిషి, రవి, నాయుడు, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. బలిఘట్టం రైతు భరోసా కేంద్రంలో శనివారం జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అనువైన అవసరమైన విత్తనాలు ఆర్.బి.కెలో ప్రభుత్వ సిద్ధంగా ఉంచిందన్నారు. కొత్తవలస 3, బలిఘట్టం రైతు భరోసా కేంద్రంలో ఆయన చేతుల మీదుగా సబ్సిడీ వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ మూకల కస్తూరి, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్య క్షులు గొరపల్లి శివ, మండల వ్యవసాయ కమిటీ ఛైర్మన్ విరోతి కొండలరావు, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, ఆదిరెడ్డి నాయుడు, మాజీ మెంబర్ చెల్లయ్య, వ్యవ సాయ సహాయ సంచాలకులు విజయ, ఎఒ మాధురి శరణ్య, రవీంద్ర, స్వాతి హేచ్‌ఒ పద్మ, వ్యవసాయ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌బికె ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ

వేపాడ : మండలంలోని పెద్ద కృష్ణరాజపురంలో రైతు భరోసా కేంద్రం ద్వారా రామస్వామి పేట సర్పంచ్ శర్మ, సచివాలయ కన్వీనర్ మమ్ములూరి వెంకట్రావు చేతులు మీదుగా శనివారం రైతులకు వరి విత్తనాలను పంపిణీచ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ శివ, వార్డు మెంబర్ ముమ్ములూరి సత్తిబాబు, వైసిపి నాయకులు పొటిపిరెడ్డి కృష్ణ, బీల వెంకట్రావు,పాల్గొన్నారు.

26న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- బొబ్బిలి

పెరుగుతున్న కరెంటు చార్జీలు, స్మార్ట్ మీటర్ల ప్రమాదంపై ఈ నెల 26న స్థానిక బృందావనం ఫంక్షన్ హాల్ రౌండ్ టుబుల్ సమావేశం నిర్వహించనున్నామని పట్టణ పౌరు సంక్షేమ సంఘ కన్వీనర్ పి. శంకరరావు తెలిపారు. శనివారం రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఈ సమావేశానికి వర్తక వాణిజ్య, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రజా సంఘాలు, వివిధ వృత్తి సంఘాలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.మణికుమార్, రైతు సంఘం నాయకులు ఎస్. గోపాల్, సిఐటియు నాయకులు బి. యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పటిష్టంగా అమలు

ప్రజాశక్తి- బొండపల్లి

జగనన్న సురక్ష కార్యక్రమం పటిష్టంగా అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి దుర్గా ప్రసాద్ కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ వైవి. రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మండల స్థాయి అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా జులై 1 నుండి అమలు చేయనున్న జగనన్న సురక్ష పథకం అమలులో ఎటువంటి ఏమరపాటు తగదన్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ ఆధ్వర్యంలో అధికారులు రెండు బృందాలుగా గ్రామాలలో నిర్దేశించిన తేదీలలో సభలు నిర్వహించాలన్నారు. గ్రామ సచివాలయాలలో ధ్రువపత్రాల మంజూరుకు సంబంధించి స్కానర్స్, ప్రింటర్స్, కంప్యూటర్‌లను సిద్ధంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎంపిపి చల్ల చలంనాయుడు మాట్లాడుతూ సురక్ష పథకం అమలులో అధికారులు బాధ్యతతో పని చేసి ప్రజలకు 11 రకాల సేవలను అందించాలని కోరారు. ఈ సమావేశంలో తహశీల్దార్ డిఎంజి ఎన్.ప్రసాదరావు, ఎంపిడిఒ వైవి. రాజేంద్ర ప్రసాద్ రావు, గంట్యాడ ఐసిడియస్ సిడిపిఒ ఎం.ఉమా భారతి, ఇఒపిఆర్‌డి సిహెచ్ సుగుణాకర్ రావు, ఎఒ దత్తి వెంకటరావు, వ్యవసాయ శాఖ ఎఒ మల్లికార్జున రావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మరింత మేలు జరుగుతోందని జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు అన్నారు. శని వారం బూరాడ పేటలో జగనన్న సురక్ష సర్వే తీరును మండల సచివాలయం కన్వీనర్, జెడ్‌పిటిసి పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి సంక్షేమ పథకాలు గూర్చి ఆరా తీశారు. సచివాలయం లో కన్వీనర్‌లు, గృహ సారదులు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బందితో చర్చించి సమర్ధవంతంగా జరపాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పథకాలు అంది తీరాలనే లక్ష్యంతో, ప్రజలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించాలనే చిత్తశుద్ధితో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారా కుల, ఆదాయం, జననం సర్టిఫికెట్లు సంబంధించిన డాక్యుమెంట్లు అవసరమైన దరఖాస్తులు పూర్తి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బెల్లాన రామారావు, కోట్ల సత్యం, కోట్ల సత్యారావు, పంచాయతి కార్యదర్శి కర్రోతు భాస్కరరావు, కన్వీనర్‌లు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, వైసిపి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ వాలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి తిరిగి సర్వే చేయాలని మండల జెసిఎస్ కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం కొత్తబగ్గం, కొనిస గ్రామాలలో జగనన్న సురక్ష యాప్ పై అవగాహన కల్పించారు. సర్వేలో ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే వాటిని యాప్లో అప్లోడ్ చేసి సచివాలయంలో తెలియపరిస్తే లబ్ధిదారునికి టోకెన్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సాలిపేట సర్పంచ్ గంట్యాడ పైడపునాయుడు, కొత్తబగం ఎంపిటిసి నారాయణ రావు, గ్రామ పెద్దలు పప్పల గురు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బొద్దాంలో శనివారం సాయంత్రం జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల కలిగే ప్రయోజనాల గూర్చి సర్పంచ్ వై. రామసత్యవతి గ్రామస్తులకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కర్యాక్రమంలో ఎంపిటిసి పి లక్ష్మి, గ్రామ పెద్ద వై సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి పద్మ, వైస్ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ: జగనన్న సురక్ష విజయవంతం చేయాలని ఎంపిపి పీరు బండి హైమావతి అన్నారు. శనివారం మండల కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అధికారులు అందరూ ప్రతి ఇంటికి వెళ్లి 11 అంశాలు కూడిన ప్రభుత్వ పథకాలను ఉచితంగా అందించేందుకు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం అందించిన పథకాలు గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి నరసింహమూర్తి, తహశీల్దార్ ప్రసన్న రాఘవ, ఎంపిడిఒ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు

తరగతి గదులు సద్వినియోగం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి జెడ్‌పి హైస్కూల్లో శారదా పరిశ్రమ, విశాఖకు చెందిన రౌండ్ టేబుల్ ఇండియా సంయుక్త నిధులతో నిర్మించిన తరగతి గదులను, ఆర్ఒ ప్లాంట్‌లను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైస్కూల్లో ఇతర మౌలిక సదుపాయాలు కల్పనకు శారద యాజమాన్యం అభివృద్ధి చేయడానికి ముందుకు రావడం గర్వించదగ్గ విషయమన్నారు. హైస్కూల్లో నాడు నేడు పనులు మినహాయించి, మిగతా మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్, ఇతర పనులు చేయడానికి శారద యాజమాన్యం ముందుకు వచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చిందన్నారు. విద్యకు అత్యధిక ప్రాధాన్యాత నిచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 4తరగతి గదులు, ఆర్ఒ ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం సంతోషదాయాకమని అభినందించారు. విద్యార్థులకు సౌకర్యవంతంగా గదులను నిర్మించి ప్రభుత్వ అభివృద్ధిలో శారదా యాజమాన్యం భాగస్వాములు కావడంపై మంచి పరిణామమన్నారు. పరిశ్రమలను స్వాగతిస్తే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ జి. నిర్మలాదేవి, ఎంపిడిఒ వై. పద్మజ, ఎంఇఒలు శ్రీదేవి, బండారు శ్రీనివాసరావు, శారదా పరిశ్రమ డిఎమ్ డి నీరజ్ శారదా, రౌండ్ టేబుల్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ ఎన్.నాయుడుబాబు, ఎంపిపిలు ఎన్.గోపమ్మ, డి,సత్యవంతుడు, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మూకల కస్తూరి, సర్పంచ్ మదిన లక్ష్మి, నాయకులు గొరపల్లి శివ, మేలాస్త్రి అప్పారావు, మదిన అప్పలరమణ, ప్రకాష్, గొరపల్లి రవి, విరోతి కొండలరావు, రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధులు, శారదా కర్మాగార ఉద్యోగులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతిలో జగనన్న ఇళ్ల లబ్ధిదార్లు జూలై నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ డిఇ జి. మురళీ మోహన్ రావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో హౌసింగ్ డే, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 8వ వార్షికోత్సవం సందర్భంగా డిఇ మురళీ మోహన్, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ లే అవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదార్లతో మాట్లాడుతూ జగనన్న ఇళ్లు మంజూరైన లబ్ధిదార్లు పునాది స్థాయిలో ఉన్న వారు జూలై నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రేవల్ల పవన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట పంచాయతీలోని జగనన్న లేఅవుట్‌ను మండల ప్రత్యేకాధికారి డి.రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్‌లో 370 ఇళ్లకు గాను మొదటి విడతలో 194 మందికి మంజూరు చేయగా 76 పునాదులు స్థాయిలో, 18 గోడలు స్థాయిలో, 7 స్లాబులు స్థాయిలో, 57 పూర్తిస్థాయిలో ఉన్నట్టు గుర్తించామని వాటి నిర్మాణ దశలను బట్టి బిల్లులు కూడా మంజూరు చేశామని చెప్పారు. ఎంపిడిఒ టీం శ్రీరంగరాజపురం గ్రామంలో సర్వే చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం మండలాధికారులతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా శాఖల పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కిషోర్ కుమార్, హౌసింగ్ ఎఇ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ నానిబాబు, ఎపిఒ సి.హెచ్ రామారావు, పురిటిపెంట ఇఒ జనార్దన్ రావు, పంచాయతీ కార్యదర్శి ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం హానికరం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మాదకద్రవ్యాలు వినియోగించడం వలన మానసిక ఆందోళన పెరుగుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ధర్మారావు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ ధర్మారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగించినట్లయితే టోల్ ఫ్రీ నెంబర్ 14500కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్. రమ్యశ్రీ, సిబ్బంది డి శివకుమార్ ఉపాధ్యాయులు బి సంధ్యారాణి, డాక్టర్ రవీంద్రనాథ్, పి భాస్కర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మత్తు పానీయాలు ప్రాణానికి హానికరమని స్థానిక ఎస్ఐ ఎం ముకుందరావు, కొత్తవలస ఆబ్కారీ శాఖ ఎస్ఐ నరేంద్రబాబు అన్నారు. మండల కేంద్రంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం 'డ్రగ్స్ రహిత సమాజం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ మత్తు పానీయాలు కారణంగా అనేక నేరపూరిత సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. మత్తు పానీయాలకు బానిసలుగా అవడంతో తమ పిల్లలను చదివించలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. కుటుంబాలలో తగాదాలు, బార్య - భర్తల మధ్య చిచ్చులు వంటి అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. గంజాయి , హెూషిన్, కొకైన్, హెరాయిన్ వంటి వాడకాలు ప్రమాదకరమన్నారు. పరిసర ప్రాంతాలలో, విద్యాసంస్థలలో డ్రగ్స్ వినియోగించే వారిని గుర్తించి తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ వి రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్లు పి శివప్రసాద్, రాఘవ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మాదకద్రవ్యాల నియంత్రణ పై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఇ. రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీనివాస పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు భోగాపురం, పూసపాటిరేగ మండలంలో వివిధ ప్రాంతంలో తరుచుగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలు కళాశాలల విద్యార్థులకు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అవగాహనతో పాటు యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నాటు సారా మాదకద్రవ్యాల వల్ల వచ్చే ప్రమాదాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ, పాల్గొన్నారు.

వైకెపి సిసి సస్పెన్షన్

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని కల్లేపల్లి గ్రామ పంచాయతీలో డ్వాక్రా గ్రూపుల లావాదేవీల విషయంలో అక్రమాలకు పాల్పడిన అప్పటి వెలుగు సిసి ఎం. ఈశ్వరరావును సస్పెండ్ చేసినట్లు ఏరియా కోఆర్డినేటర్ ఎన్ ఆదయ్య శనివారం తెలిపారు. అదే విషయంలో సమగ్రంగా విధులు నిర్వహించక పోవడంతో ప్రస్తుత సిసి యు కోటయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - గజపతినగరం

ఆటో కారు ఢీ కొన్న సంఘటన శనివారం మరుపల్లి సమీపంలో జరిగింది. వాలం కంపెనీలో పని ముగించుకుని గజపతినగరం వైపు తిరిగి ప్రయాణమైన కూలీల ఆటోను వెనుక వైపు నుంచి వచ్చి కారు ఢీకొనడంతో ఆటోలో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఒక మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ కార్మికుడు దుర్మరణం

వేపాడ:మండలంలోని సోంపురం పంచాయతీలోని శ్రీదేవి రాతి క్వారిలో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. గెమ్మెల బుద్ధు(30) శనివారం క్వారీలో డ్రిల్లింగ్ చేస్తూ సుమారు 150 అడుగుల ఎత్తు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

లారీ ఢీకొని టీచర్ మృతి

ప్రజాశక్తి- విజయనగరం

విజయనగరం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా టీచర్ సోమయాజుల సునీత (32) మృతి చెందారు. ఈమె పట్టణంలోని ఒక ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం తిరిగి స్కూటీపై పాఠశాలకు వెళుతుండగా సింగపూర్ సిటీ సమీపంలో విజయనగరం నుంచి నాతవలస వైపు వెళుతున్న లారీ బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.